# ప్రజాశక్తి

శుక్రవారం 28 ఏప్రిల్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

## నీళ్లకూ

# నిధులదే సమస్య

- జిల్లాలో తాగునీటి రవాణా ఏజెన్సీలకు బకాయిలు రూ.150 కోట్లకు పైనే..
- పట్టణాలు, పల్లెల్లో ట్యాంకర్లు వెళితేనే గొంతు తడిచేది..
- 261 ఆవాస గ్రామాల్లో తాగునీటి వనరులు లేనట్లే.!

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

వేసవిలో నీళ్ల రవాణా చేసుకుంటే పదిరూపాయలు వస్తాయనే ఆశతో ట్రాక్టర్లు కొనుక్కుని వాటికి ట్యాంకర్లు పెట్టుకున్న వారికి అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు ఉన్న కొందరు జీవనం కోసం వాటికి ట్యాంకర్లను తయారు చేయించుకున్నారు. మండలాల్లో అధికారులు, అధికారపార్టీ నేతల మాటలు విని నీళ్ల రవాణా చేశారు. అయితే బిల్లులు మాత్రం వారికి ఇవ్వడం లేదు. ఏళ్ల తరబడి పెండింగులో ఉన్నాయి. కొద్దికొద్దిగా ఇస్తారు. ఆయిల్‌కు వస్తే చాలనుకొని కొందరు.. ట్యాంకర్లతో ఇంకేమీ చేయలేక కొందరు నీటిని రవాణా చేస్తూనే ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు గడ్డుగా ఉన్నందున నీళ్ల తోలిన వారికి కూడా డబ్బులు చెల్లించడం లేదు. ట్యాంకర్ల యజమానుల్లో చిన్నచిన్న నాయకులు కూడా ▶ 2లో

## ఆరోగ్యశ్రీ

# బకాయిలు ఎప్పుడిస్తారో.?

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు రూ.70 కోట్ల బకాయిలు
- బిల్లులు ఎప్పుడు వస్తాయోనని హాస్పిటల్ యాజమాన్యాల ఎదురుచూపులు
- నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1 నుంచి వైద్యసేవల నిలిపివేత?

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

**డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ బకాయిల కోసం నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఎదురుచూస్తున్నాయి. ఆరోగ్యశ్రీ బకాయిలు వస్తాయో, లేదో అన్న ఆందోళనలో హాస్పిటల్స్ యాజమాన్యాలు ఉన్నాయి. బకాయిలు పెరిగిపోవటం ఆయా హాస్పిటల్స్‌కు పెను భారంగా మారాయి. మే ఒకటో తేదీ నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసే ఆలోచనలో నెట్‌వర్క్ హాస్పిటల్స్ యాజమాన్యాలు ఉన్నట్లు సమాచారం.**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పరిధిలోని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు సుమారు రూ.70 కోట్లకు పైగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుండి బకాయిలు రావాల్సి ఉంది. గత ఎనిమిది నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రైవేట్ హాస్పిటల్స్‌కి రావాల్సిన ఆరోగ్యశ్రీ బకాయిలు నిలిచిపోవటంతో ప్రైవేట్ హాస్పిటల్స్ నిర్వహణ కష్టంగా మారింది. ఒంగోలు నగరంలోని కిమ్స్, అమత హార్ట్ హాస్పిటల్, వెంకటరమణ నర్సింగ్ హెూం, ప్రకాశం మల్టీ స్పెషాలిటీ తదితర హాస్పిటళ్లకు.. ఒక్కో హాస్పిటల్‌కు రూ.రెండు కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉండటం గమనార్హం. ఆయా హాస్పిటల్స్‌కు ఈ బకాయిలు పెనుభారంగా మారాయి. దీనికితోడు ఆరోగ్యశ్రీలో సర్జరీలు చేయాల్సి వచ్చినప్పుడు చేరిన రోగులకు ముందుగా హాస్పిటల్ వారు మందుల దగ్గర నుండి ఆపరేషన్ ఇంప్లాంటేషన్ వస్తువులు, భోజనం వరకు రోగికి ఉచితంగా అందించాలి. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి బిల్లులు రాకపోవడంతో హాస్పిటల్స్ చేసిన ఆపరేషన్ల తాలూకా ఇంప్లాంటేషన్ వస్తువులు, మందులకు ఆ కంపెనీ వారికి డబ్బులు చెల్లించలేకపోతున్నారు. దీంతో కొన్ని చిన్న హాస్పిటల్స్ వారు అప్పులు చేసి మరీ హాస్పిటల్స్‌ని నడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరోగ్యశ్రీ విభాగంలో సర్జరీస్ కోసం వచ్చే పలువురు పేషెంట్లకు ఆరోగ్యశ్రీ అప్రూవల్ రాక.. వాళ్ల డబ్బులు పెట్టలేక చాలామంది ఆపరేషన్లు వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. ఖచ్చితంగా ఆరోగ్యశ్రీలో అనుమతించాల్సిన ఆపరేషన్లకు కూడా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుండి అనుమతి మంజూరు కావట్లేదు. చాలామంది రోగులకు సంబంధించిన దరఖాస్తులను ఆరోగ్యశ్రీ రాష్ట్ర విభాగం తిరస్కరిస్తున్నట్లు రోగులు, పలువురు డాక్టర్లు బాహాటంగా చెబుతున్నారు. గతంతో పోలిస్తే ఆరోగ్యశ్రీ విభాగం ఏడాదిగా అస్తవ్యస్తంగా ఉందని.. రోగులకు మంజూరు చేయాల్సిన ఆపరేషన్ అనుమతులు తిరస్కరించటమే కాకుండా ఇప్పటికే హాస్పిటల్స్‌కు గత 8 నెలలుగా బకాయిలు చెల్లించకుండా మీనవేషాలు లెక్కేస్తుండటంతో చిన్నచిన్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాస్పిటల్లో పనిచేసే టెక్నికల్ స్టాఫ్ నుంచి సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితికి కొన్ని హాస్పిటల్స్ చేరుకున్నాయి ప్రైవేటు అద్దె భవనాల్లో నడుపుతున్న పలు హాస్పిటళ్లు అద్దె కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలు నగరంతో పాటు చీరాల, కందుకూరు, మార్కాపురం ప్రాంతాల్లో ఉన్న ▶ 2లో

## మోడీని గద్దె దించకపోతే

# ప్రజల మనుగడకే ప్రమాదం

- దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళుతున్న బిజెపికి బుద్ధి చెప్పాలి
- బహిరంగ సభలో సిపిఎం, సిపిఐ పిలుపు

ప్రజలకు అభివాదం చేస్తున్న సిపిఎం, సిపిఐ రాష్ట్ర, జిల్లా నేతలు

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

దేశంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే ప్రజల మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని, దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళుతున్న బిజెపికి ప్రజలు బుద్ధిచెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. 'ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం..దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. సభకు సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు జి.రమేష్, పివిఆర్.చౌదరి అధ్యక్షత వహించారు. బహిరంగ సభలో సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ దేశ సంపదను ప్రధాని మోడీ అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజలు అధిక ధరలతో సతమతమవుతుంటే ఆదానీ ఆస్తులు మాత్రం లక్షల కోట్లకు పెరుగుతున్నాయని చెప్పారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని కేంద్ర, రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పాయని, అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని రకాల ధరలు పెంచి.. ప్రజల నడ్డి విరుస్తున్నారని వివరించారు. చెత్త మీద, ప్రజలు తాగే పెరుగు, మజ్జిగల మీద కూడా పన్నులు వేసి ప్రజలను దోచుకుంటున్నాయని చెప్పారు. చెత్త మీద పన్ను వేయమని నరేంద్ర మోడి చెబితే ఇక్కడ జగన్ అమలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కును అమ్మడం అంటే ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని అమ్మడమేనని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని చెప్పారు. సిబిఐ, ఈడి, ఆఖరికి కోర్టులను కూడా బిజెపి ప్రభుత్వం ప్రభావితం చేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాలకు బిజెపి ప్రమాదం పొంచి ఉందని ▶ 2లో

మాట్లాడుతున్న మజుందర్

# మేడేను జయప్రదం చేయండి

## సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందర్

**ప్రజాశక్తి-బాపట్ల**

మేడేను పురస్కరించుకొని కార్మిక, కర్షక, ప్రజా అనుకూల విధానాల అమలు కోసం ప్రతి గ్రామంలో రైతులు, కార్మికులు మేడే సంబరాలు జరుపుకోవాలని, కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలి సిఐటియు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందార్ పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్ అధ్యక్షతన బాపట్ల పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సిఐటియు బాపట్ల జిల్లా కమిటీ సమావేశంలో మజుందార్ మాట్లాడారు. కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, స్కీమ్‌వర్కర్లు, అంగన్వాడీ, ఆశా, యానిమేటర్లు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. అప్పటి వరకు వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వసంతరావు, జి.సుధాకర్, ప్రతాప్, ఆదాము, దాసు, శామ్యేలు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## నీళ్లకూ నిధులదే సమస్య

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. సర్పంచులూ ట్యాంకర్లు పెట్టుకున్నారు. బిల్లులు ఇవ్వకపోయినా సొంతగానే జనానికి నీళ్లివ్వాలనే భావనతో కొందరు ఉన్నారు. ఇలా పల్లెలు, పట్టణాల్లో ఇప్పటికే రూ.150 కోట్లకు పైగానే నీటి సరఫరా విభాగం అధికారులు బిల్లులు ఇవ్వలేదు. వీటిపై డిఆర్‌సీలో ఎమ్మెల్యేలు కూడా గగ్గోలు పెట్టారు. చాలా రోజులుగా తాగునీటి సరఫరా బిల్లులపై చర్చ సాగుతూనే ఉంది. గత డిఆర్‌సీలోనూ చర్చకు వచ్చింది. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు గతంలోనూ, నిన్న జరిగిన డీఆర్‌సీలోనూ ప్రస్తావించారు. గ్రామీణ నీటిసరఫరా విభాగం పరిధిలో రూ.130 కోట్ల వరకూ బకాయిలున్నాయి. వాటిలో రూ.62 కోట్లు యర్రగొండపాలెం నియోజకవర్గంలోనే ఉన్నాయి. మున్సిపాలిటీల్లో రూ.26.46 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఒంగోలు కార్పొరేషన్‌లో రూ.3.57 కోట్లు, మార్కాపురం మున్సిపాల్టీలో రూ.2.74 కోట్లు, కనిగిరిలో రూ.10.54 కోట్లు, గిద్దలూరులో రూ.5.17 కోట్లు, పొదిలి నగర పంచాయతీలో రూ.4.43 కోట్లు పెండింగులో ఉన్నాయి. అయినా మంత్రి ఆదిమూలపు సురేష్ మాత్రం పట్టించుకోలేదంటున్నారు. ఇటీవల సిఎం జగన్ జిల్లాకు వచ్చినా ఒక్క ఎమ్మెల్యే గానీ, మంత్రులు గానీ ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకుపోలేదు. ఇలాంటప్పుడు నిధులు ఎలా వస్తాయనే ఆలోచన కూడా నేతలకు కలగడం లేదు. జిల్లాల్లో జరిగే సమావేశాల్లో గగ్గోలు పెట్టినా ఫలితం లేదు. పెద్దారవీడు మండలంలో స్వయంగా పార్టీ నేతలే మంత్రి సురేష్‌ను ఇటీవల నిలదీశారు. బిల్లుల కోసం గగ్గోలు పెట్టారు. నిధులు లేనందున వారి ఆక్రోశం ఆవిరైంది. ప్రస్తుతం వేసవి కార్యాచరణ ప్రణాళికకూ నిధులు కావాలి. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.22.81 కోట్లతో ప్రణాళికను రూపొందించారు. 261 ఆవాస ప్రాంతాల్లో నీటి రవాణా, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలతో నీటిని అందించాలి. ఇప్పటికీ ట్యాంకర్లు వెళితేనే జనం గొంతు తడిచే గ్రామాలు వందల్లో ఉన్నాయి. నిత్యం 1249 ట్రిప్పులు నీళ్ల తోలుతున్నారు. పట్టణాల్లోనూ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం 126 గ్రామాల్లో నీటి వనరులు అన్నీ ఎండిపోయాయి. ఎండలు తీవ్రమవుతున్నాయి. ఇంకా సమస్య పెరగనుంది. నిధుల్లేకుండా నీళ్లు తోలే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు నీటికి నిధుల కోసం ప్రభుత్వంపై గట్టిగా ప్రయత్నాలు చేయాల్సి ఉంది.

## ఆరోగ్యశ్రీ బకాయిలు ఎప్పుడిస్తారో ?

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్యశ్రీ హాస్పటల్స్ కూడా బకాయిలు ఉండటంతో ఆరోగ్యశ్రీ కేసులు తీసుకొని వైద్యం చేయటానికి ఇప్పటికే నిరాకరిస్తున్నారు. ఒకటి, రెండు కేసులు తప్ప ఎక్కువ కేసులు ఆరోగ్యశ్రీలో చేర్చుకోవడానికి పలు హాస్పిటల్స్ ఇష్ట పడకపోవటంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రైవేట్ హాస్పిటల్స్‌కు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించి.. రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వైద్యసేవలు కోల్పోతున్న ప్రజలు కోరుతున్నారు.

**1 నుంచి వైద్య సేవల నిలిపివేత?**

ఆరోగ్యశ్రీ విభాగంలో చేసిన సర్జరీలకు బకాయిలు రాకపోవటంతో ప్రైవేట్ హాస్పిటల్స్ మూకుమ్మడిగా ఆరోగ్యశ్రీ సేవలను మే ఒకటో తేదీ నుండి నిలుపుదల చేయాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ప్రైవేట్ హాస్పిటల్స్ సమావేశంలో ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. నెట్‌వర్క్ హాస్పిటల్స్ సర్జరీలను నిలిపివేస్తే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశాలుఉన్నాయి.

**బకాయిలు బిల్లులు ట్రస్ట్‌కి పంపించారు**

**డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఆర్యోగశ్రీ జిల్లా కోఆర్డినేటర్**

నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు సంబంధించి తక్కువ మొత్తంలోనే బకాయిలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కి చివరి క్వార్టర్స్‌కి సంబంధించిన బకాయి బిల్లులను పంపించారు. వాటిని సిఎస్‌ఎంఎస్ ద్వారా చెల్లించేందుకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిద్ధమవుతోంది. మే ఒకటి నుంచి నెట్‌వర్క్ హాస్పిటల్స్ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఇఒకి గానీ, జిల్లాలోని హాస్పిటల్స్ యూనియన్లు గానీ ఎలాంటి దరఖాస్తు ఇవ్వలేదు.

# బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలి

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సి హెచ్. మజుందర్ తెలిపారు. బిజెపి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రచార భేరి నిర్వహించారు. రైతు సంఘం నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావుతో ప్రచారం నిర్వహించారు. బిజెపి విధానాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంజుదర్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ విధానాలవల్ల అలుముకుంటున్న చీకట్ల నుంచి బైటపడటానికి ప్రజలు ఉద్యమించాలని కోరారు. మైనారిటీలు,దళితులు. గిరిజనులు,మహిళలు,అణగారిన వర్గాల రక్షణ కోసం,ప్రజాస్వామ్య హక్కులకోసం,పౌరహక్కుల రక్షణ కోసం విశాల ఐక్య ఉద్యమాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల పాలిట పీడకలగా మారిన కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను ఓడించి దేశ స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు రైతుసంఘం నాయకులు బొడెంపుడి సూరిబాబు, ఎనికపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

**బహిరంగ సభను జయప్రదం చేయాలి**

**సంతనూతలపాడు రూరల్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా ఈనెల 30న వామపక్షాల ఆధ్వర్యంలో సంతనూతలపాడులో ప్రచార భేరి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రచారభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. బహిరంగ సభలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, కోదాటి కోటేశ్వరరావు, సంపత్ కుమార్ , బంకా పద్మ తదితరులు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ అందజేత

**ప్రజాశక్తి-వేటపాలెం**

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్‌కు హాజరైన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినట్లు సెక్రటకరీ వనమా రామకష్ణారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ చేరబోయే విద్యార్థులకు నిర్వహించబడుచున్న పాలిసెట్ - 2023 కు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో చీరాలలో ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్ హాజరైన విద్యార్థులకు శిక్షణకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేసినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణు గోపాలరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ పాలిటెక్నికక్ కళాశాల డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ కె. విజయ భాస్కరరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మోడీని గద్దె దించకపోతే ప్రజల మనుగడకే ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించారు. తెలంగాణలో అధికారం ఇస్తే మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్‌షా చెబుతున్నాడని, మైనార్టీల ప్రతినిధులమని చెప్పుకునే జగన్, విజన్ ఉన్న నేతనని చెప్పుకునే ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు దీన్ని ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. మాట్లాడితే సింహం సింగిల్‌గా వస్తుందని జగన్ ప్రగల్భాలు పలుకుతున్నారని ముందు మోడీ బోనులో నుంచి జగన్ సింహం బయటకు వచ్చి.. విశాఖ ఉక్కు కోసం ఢిల్లీలో ధర్నా చేయాలని హితవు పలికారు. విశాఖ ఉక్కు కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఆయన సింహమో, పులో ప్రజలు ఆలోచిస్తారని చెప్పారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి నాయకులను ఇక్కడ నుంచే వైసిపి నుంచి రాజ్యసభకు పంపతున్నారని వివరించారు. లక్షల కోట్లు కొల్లగొడుతున్న కార్పొరేట్ పెత్తందార్ల నాయకుడిగా ఉన్న మోడీ విజన్ చంద్రబాబుకు ఎలా నచ్చిందో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో బిజెపి ప్రజల్లో లేకపోయినా ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు మాత్రం బిజెపితో ఉన్నారని గుర్తు చేశారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వారు బిజెపిని బలపరిచిన విషయాన్ని గుర్తుచేశారు. బిజెపితో జతకట్టిన పార్టీలు మట్టి కొట్టుకుపోయాయని, ఆవిషయాన్ని ఇక్కడ వైసిపి, టిడిపిలు గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజల వైపు ఉంటారని, బిజెపితో జతకట్టే ఎవరినైనా ఓడించడానికి సిద్ధంగా ఉంటారని గుర్తుచేశారు. దేశాన్ని బిజెపి తిరోగమనం వైపు నెడుతోందని వివరించారు. విద్య, సైన్సు రంగాలలోకి మూఢనమ్మకాలను చొప్పించి ఆ రంగాలను నాశనం చేస్తున్నారని చెప్పారు. బిజెపిని ఓడించేందుకు పార్టీలకు అతీతంగా ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ 2024లో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందన్నారు. మైనార్టీల రిజర్వేషన్‌లు రద్దు చేసి దళితులు, వెనుకబడిన వర్గాలకు ఇస్తామని చెబుతూ ఆయా వర్గాల ప్రజల మధ్య చిచ్చుపెట్టే కుట్ర చేస్తున్నారని చెప్పారు. మోడీ పాలనలో అదానీ ఆస్తి రూ.16లక్షల కోట్లుకు పెరిగిందని హెడెన్ బర్గ్ నివేదిక చెబితే దానిమీద విచారించేందుకు బిజెపి సిద్ధంగా లేదన్నారు. రాష్ట్రంలో పోర్టులు, పవర్ ప్రాజెక్టులను జగన్ ఆదానీకి కట్టబెడుతున్నాడని చెప్పారు. దేశంలో బిజెపి ముఖ్యమంత్రుల కంటే జగన్ ఎక్కువగా అదానికి సాగిలా పడుతున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి ఊసే లేదన్నారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు యర్రగొండపాలెంలో మీటింగు పెట్టుకుంటే ఏకంగా మంత్రే అడ్డుపడాలని చూశాడని చెప్పారు. రాష్ట్రంలో దళితుల మీద దాడులు, హత్యలు జరుగుతుంటే మాట్లాడని దళిత మంత్రి సురేష్‌కు చంద్రబాబునాయుడు యర్రగొండపాలెం వస్తే మాత్రం దళితులు గుర్తుకువచ్చారని విమర్శించారు. బిజెపిని గద్దె దింపాలని సాగుతున్న పోరాటంలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, జివి కొండారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, సిపిఎం నగర నాయకులు దామా శ్రీనివాసరావు, సిపిఐ నగర నాయకులు ఎస్‌డి సర్దార్, తదితరులు పాల్గొన్నారు.


**పత్రిక ప్రకటన**

నా క్లయింట్ అయిన గుంటూరుసిటీ, పాత గుంటూరు డోరు నెం.15-6-57/2, కాపురస్తులు పోలక వెంకట నారాయణరెడ్డి, తండ్రి : అంకిరెడ్డి వలన సమాచారం పొంది ఈప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

నా క్లయింట్ అయిన పోలక వెంకట నారాయణరెడ్డి గారు గుంటూరు వాస్తవ్యులైన షేక్ ఇస్మాయిల్ తండ్రి షేక్ ఖలీల్ సాహెబ్ గారి ద్వారా విక్రయం పొందిన ఖాళీ నివేశన స్థల విక్రయ లింక్ దస్తావేజు అయిన పుట్టా తిరుపతిరావు, తండ్రి వెంకటేశ్వర్లు 1845/1999 ఒరిజినల్ డాక్యుమెంట్ మా స్వగ్రామం అయిన కనిగిరి మండలం, కృష్ణాపురం నుండి లోను కొరకు గురవాజీపేట యూనియన్ బ్యాంకుకు పోయి వచ్చే దారిలో జారి పడిపోయినది. ఎంత వెదికినా దొరకలేదు. అందువల్లన పైన తెలిపిన డాక్యుమెంట్ నెం. 1845/1999 ఒరిజినల్ ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింట్ అడ్రస్‌కు గానీ ఈ క్రింది చిరునామాకుగానీ అందజేయవలసినదిగా కోరుచున్నాము.

ఎస్‌కె.మీరావలి,
అడ్వకేట్, వైఎస్‌ఆర్ రోడ్,
కనిగిరి, ప్రకాశంజిల్లా.
సెల్ : 9100271272.

**పబ్లిక్ నోటీసు**

ప్రకాశం జిల్లా, కొండెపి మండలం, ఇలవర గ్రామం, నేతివారి పాలెం గ్రామ నివాసి **రావిపాటి శ్రీహరి, తండ్రి రావిపాటి వెంకటేశ్వర్లు** ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీజు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింట్ తండ్రిగారైన రావిపాటి వెంకటేశ్వర్లు తండ్రి రావిపాటి కోదండయ్య @ కొండయ్య తన పూర్వీకుల ద్వారా సంక్రమించబడిన కొంత ఆస్తిని మరియు కొనుగోలు ద్వారా వచ్చిన కొంత ఆస్తిని కలిపి, నా క్లయింట్ పేరుమీద ఒక సెటిల్మెంట్ దస్తావేజును వ్రాయించి సింగరాయకొండ సబ్‌రిజిష్టర్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన **దస్తావేజు నెంబరు 241/2023** ద్వారా నా క్లయింట్‌కి సంక్రమించబడి తదాది నా క్లయింట్ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగియున్నారని మరియు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని **"కెన్‌ఫిన్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్"** ఒంగోలు వారి వద్ద తనకా ఉంచి ఋణం తీసుకొనుచున్నారు. కావున ఎవరికైననూ సదరు ఆస్తి గురించి గాని, హక్కుల గురించి గాని అభ్యంతరాలు వున్నయెడల లిఖితపూర్వకంగా తగిన దస్తావేజులతో ఈ నోటీసు ప్రకటించిన **(ఏడు) దినములలోపు,** ఈ క్రింది సంతకం దారుని సంప్రదించగలరు. లేనియెల ఎవ్వరికీ ఏవిధమైన అభ్యంతరాలు గాని, హక్కులు గాని లేవని భావించి మా క్లయింట్ దిగువ షెడ్యూల్ ఆస్తిపై ఋణము తీసుకొనగలరు. గడువు తరువాత వచ్చు అభ్యంతరాలు మా క్లయింట్ గాని రుణదాతను కాని సిద్ధపరచజాలవని యావన్మందికి తెలియజేయటమైనది. **షెడ్యూలు :** ప్రకాశం జిల్లా సింగరాయకొండ సబ్ డిస్ట్రిక్ట్, కొండెపి రెవిన్యూ మండలం ఇలవర గ్రామపంచాయతీ, ఇలవర గ్రామ సర్వే నెంబర్ : 270 ఖాళీస్థలం ఏరియా విస్తీర్ణం 266.2 చ.గ. ఖాళీస్థలంకు హద్దులు: **తూర్పు:** బజారు, **పడమర:** కామేపల్లి పోవు రోడ్, **ఉత్తరం:** రావిపాటి వెంకయ్య గృహస్థలం, **దక్షిణం:** నేతి తిరుమలరావు గృహస్థలం. ఈ హద్దులలో **266.2** చ.గ. లేదా **2395.80** చ.అ.గా గల ఖాళీస్థలమునకు సంబంధించి యావత్తు హక్కులతో సహా.

**శిఖాకొల్లి రమేష్,** న్యాయవాది,
ఎ-బ్లాక్, 4వ ఫ్లోర్, షాప్ నెం. 5(ఎ) గుప్తాస్ స్క్వేర్, 60 ఫీట్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఫోన్: 99491 36259

**పబ్లిక్ నోటీసు**

ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, మాచ
గ్రామకాపురస్తులు **దండా శీతారామిరెడ్డిగారి కుమార**
**వెంకట్రామిరెడ్డిగారు** మాకు ఇచ్చిన సంజాయిషీ మే
యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియచేయు
ఏమనగా పూర్వములో ఈ దిగువ షెడ్యూలు దాఖలా
లేటు దండా శీతారామిరెడ్డి గారికి హక్కు కలిగి వారు సం
హక్కుభుక్తములుతో అనుభవించుచూ, వారు ఎట్టి వ్రా
వ్రాయకుండా మరణించినందున, వారి వారసులయిన ద
వెంకట్రామిరెడ్డి, దండా కృష్ణారెడ్డి మరియు దండా హైమావతి గ
సంక్రమించి వారు అనుభవిస్తూ వున్న దిగువ షెడ్యూలు దాఖలా ఆ
దండా కృష్ణారెడ్డి గారు మరియు దుంపా హైమావతిగారు వారికి
2/3 వంతు హక్కులను రూ. 1,28,000/- తీసుకో వారితోపే
జాయింటు హక్కుదారుడైన దండా వెంకట్రామిరెడ్డిగారి పేర
ఒక హక్కు విడుదల దస్తావేజు వ్రాయించి సదరు దస్తావేజును
1042/2022 గా అమ్మనబ్రోలు సబ్‌రిజిష్టారు వారి ఆఫీసులో రిజ
చేయించినారు. సదరు దస్తావేజునకు సవరణ దస్తావేజు వ్రాయి
సదరు రిజిష్టారు వారి ఆఫీసులో దస్తావేజును 2023/202
రిజిష్టరు చేయించుట ద్వారా, సదరు దండా వెంకట్రామిరెడ్డి
సంపూర్ణ హక్కుభుక్తములుతో అనుభవిస్తున్నారు. నా క్లయి
దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై "కెన్ ఫిన్ హోమ్స్ ప్రై
లిమిటెడ్" ఒంగోలు వారివద్ద గృహనిర్మాణము కొరకు రుణ
తీసుకొనుచున్నారు.షెడ్యూలు: ప్రకాశం డిస్ట్రిక్టు అమ్మనబ్రో
సబ్.డి. యిలాకా నాగులుప్పలపాడు మండలం, మాచవరం గ్రామ
సదరు గ్రామ పంచాయితీ సర్వే నెం. 317/5రులో డోరు నెం. 3
రుగా గల పెంకుటింటిని శిధిలం చేసిన తదుపరి ఖాళీస్థలము
హద్దులు: **తూర్పు:** దండా సీతారామిరెడ్డిగారి స్థలం హద్దు, యీ
30 అడుగులు, **దక్షిణం:** ఇనగంటి వెంకటేశ్వరరెడ్డి గారి పెంకుటిం
ల్లు హద్దు, యీ దిశ 43 అడుగులు. **పడమర:** దండా కృష్ణారెడ్డి
డాబా యిల్లు హద్దు, యీ దిశ 30 అడుగులు. **ఉత్తరం:** రోడ్డు హ
యీ దిశ 44 అడుగుల 2 అంగుళములు. యీ హద్దులలోనిది
0-03 సెంట్లు మూడు శెంట్లు లేక 145.2 చదరపు గజములు.

**చల్లా వెంకటప్పారెడ్డి,** న్యాయవాది,
డోర్ నెం. 24-1-19, పాత గవర్నమేంట్ హాస్పిటల్ ఎద
ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఫోన్: 98480 4490

**ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**ఐ.పి.నెంబరు 18/2019**

సూదన గుంట లక్ష్మీనారాయణ ..... పిటిషనర్
వర్సెస్
నల్లమోతు శేషమ్మ వగైరా .... రెస్పాండేంట్స్

To
అర్ 2) మచ్చా సుబ్బారాయుడు, తండ్రి పేరయ్య
డోర్ నెంబర్ 7-1/B, సమతానగర్,
కర్నూల్ రోడ్ , ఒంగోలు.

పై నెంబరు పిటిషనరు క్రెడిటారు ఐపి దాఖలు చేయగా మీ నోటిస్ నిమిత్తం తేదీ 12.05.2023కి వాయిదా వేసినారు వాయిదా రోజున ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయంగా గాని అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

ఇట్లు
**మొలకలపల్లి అజయ్‌బాబు**
**గుంటూరు రామమూర్తి**
పిటిషనర్ తరపు న్యాయవాదులు
ఒంగోలు

ప్రజాశక్తి
శుక్రవారం 28 ఏప్రిల్ 2023
3

# చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు

**- రూ.13.75 లక్షల సొత్తు స్వాధీనం**
**- వివరాలు వెల్లడించిన ఎస్‌పి**

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి మల్లిక గర్గ్

**ప్రజాశక్తి - ఒంగోలు క్రైం**

నగరంలో రెండు చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.13.75 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి మల్లిక గర్గ్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. ఎస్‌పి కథనం ప్రకారం...గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన చోల్లంగి సురేష్, నగరంపాలెంకు చెందిన మర్రి రవికుమార్, నల్లచెరువుకు చెందిన కువ్వారపు అజయ్ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిందితులు గతేడాది డిశంబర్‌లో ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని భాగ్యనగర్ 3వలైన్‌లో బాలిన శ్రీమన్నారాయణ ఇంటి పగుల కొట్టి చోరికి పాల్పడ్డారు. 64 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి, రూ.20 నగదును చోరీ చేశారు. అదే ఏడాది తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్వతం అనుపల్లవి ఇంటి తాళాలు పగులకొట్టి బంగారు ఆభరణాలు, ల్యాబ్‌ట్యాప్ దొంగలించారు. బాపట్లలోనూ ఓ ఇంటిలో చోరికి పాల్పడాడరు. నిందితులను గురువారం రాత్రి గాంధీరోడ్డులో పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. కేసులో ప్రతిభ కనపరచిన పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి క్రైం శ్రీధర్‌బాబు, ఒంగోలు డిఎస్‌పి యు.నాగరాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల పటిష్టతే లక్ష్యం

**జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ**

మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

**ప్రజాశక్తి-చీమకుర్తి**

ప్రభుత్వ పాఠశాలల పటిష్టత, విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు, అమ్మఒడి, విద్యాదీవెన లాంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల ఏర్పాటుకు కృషి చేసిన బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు, అప్పటి విద్యాశాఖామంత్రి ఆదిమూలపు సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం అలరించాయి. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జవహర్, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీ నారాయణ, ఎంఇఒ రవి, వ్యాపారవేత్త మన్నం శ్రీధర్, ఆర్‌ఎల్‌పురం సర్పంచి పుల్లగూర రమణమ్మ రామారావు,ఎన్ నాగలక్ష్మి, ముత్యాల ప్రసాదు,ఉపాధ్యాయులు నల్లూరి వెంకటేశ్వరరావు, చల్లాశ్రీనివాస్, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

## కూలీల లారీని ఢీకొన్న మరో లారీ..

**- మహిళ మృతి**
**- పలువురికి గాయాలు**

మృతేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి - ఒంగోలు క్రైం**

కూలీలతో వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొప్పోలు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై గురువారం చోలు చేసుకుంది. ఈ ప్రమాదంలో సంపూర్ణ (29) అనే మహిళ మృతి చెందింది. అందిన వివరాల ప్రకారం... సిఎస్ పురం గ్రామానికి చెందిన ఇర్ల రమణయ్య జీవనం నిమిత్తం పెళ్లూరు గ్రామంలో ఉంటున్నారు. ఒంగోలు చుట్టూప్రక్కల గ్రామాలలో కాంక్రీటు పనులు చేసుకుంటూ జీనవనం సాగిస్తున్నాడు. రమణయ్య సోదరుడు శ్రీనివాసులుకు సిమెంటు మిక్సింగ్ మిషన్, టాటా లారీ ఉంది. కాంక్రీట్ పనులకు లారీలో వెళ్లి వస్తున్నారు. రోజులాగే గురువారం ఉదయం 6 గంటల సమయంలో పెళ్లూరు నుంచి కొప్పోలు కాంక్రీట్ పనుల నిమిత్తం వెళుతున్నారు. కాంక్రీట్ మిక్సింగ్ మిషన్‌ను లారీ కట్టుకొని వెళ్తున్నారు. అదే సమయంలో జాతీయ రహదారిపై ఎన్.అగ్రహారం అడ్డరోడ్డు వద్దకు వచ్చే సరికి చెన్నై వైపు నుంచి వెస్ట్‌బెంగాల్ చెందిన లారీ కాంక్రీట్ మిషన్ ను ఢీకొట్టి కొంది. దీంతో లారీలోని కూలీలందరూ కింద పడిపోయారు. సంపూర్ణ రోడ్డుపై పడింది. కాంక్రీట్ మిషన్ ఆమెపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. తాలూకా సిఐ ఆర్. రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రిమ్ హాస్పిటల్‌కు తరలించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

**సంతమాగులూరు :** అంగన్‌వాడీ కేంద్రాలోని చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి రాజేష్ తెలిపారు. ఐసిడిఎస్ పాత మాగులూరు సెక్టార్ పరిధిలోని తంగేడుమల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రంగనాథ్ బాబు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగరాజకుమారి, గ్రామ కార్యదర్శి పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వంలో బూచేపల్లి వెంకాయమ్మ

## జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి: బూచేపల్లి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. చీమకుర్తిలోని 15వ వార్డులో గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి కలిసి బూచేపల్లి వెంకాయమ్మ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా ?లేదా ? అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు ,కౌన్సిలర్లు ఎ.రామబ్రహ్మం, ఆలపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సిఎంను కలిసిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

సిఎం జగన్‌తో ప్రవీణ్‌కుమార్ రెడ్డి

**ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్**

గిద్దలూరు నియోజకవర్గ వైసిపి నాయకుడు ప్రవీణ్ కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి స్వయంగా పిలిపించాడు. ఈ సందర్భంగా గిద్దలూరు నియెజక వర్గ రాజకీయ పరిస్థితుల గురించి ప్రవీణ్‌కుమార్ రెడ్డిని అడిగి సిఎం తెలుసుకున్నారు. బుధ వారం పుట్టపర్తి జిల్లా పర్యటన సందర్భగా సిఎం జగన్మోహన్ రెడ్డి తన క్లాస్‌మేట్, వైసిపి నాయకుడు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డిని పిలిపించుకొని గిద్దలూరు నియోజక వర్గ రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. తొలుత పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి, సిఎం జగన్మోహన్ రెడ్డి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గతంలో తాము చదువుకున్న కాలేజి రోజులు గుర్తు చేసుకున్నారు. తాడేపల్లి వచ్చి తనను కలవాలని సిఎం జగన్ ప్రవీణ్ కుమార్ రెడ్డికి సూచించారు. వారం రోజుల్లో కలుస్తానని ప్రవీణ్ కుమార్‌రెడ్డి సిఎం జగన్‌కు తెలిపారు.

## పోక్సో కేసులో అధ్యాపకుడు అరెస్టు

**ప్రజాశక్తి-పర్చూరు**

పోక్సో కేసులో ఓ ఉపాధ్యాయుడిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. డిఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని 17 సంవత్సరాల బాలిక చిలకలూరి పేటలో ఇంటర్ పూర్తి చేసింది. ఆమె కళాశాలకు వెళ్ళే సమయంలో అధ్యాపకుడిగా ఉన్న యద్దనపూడి గ్రామానికి చెందిన ఎ.భుజంగరావు బాలికను మభ్య పెట్టి లొంగదీసుకున్నారన్నారు. భుజంగరావు తన భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్న సంగతి చెప్పకుండా బాలికను వివిధ ప్రాంతాలకు తీసుకు వెళ్ళి తన అవసరాలు తీర్చుకున్నాడు. కొద్ది రోజుల క్రితం బాలిక అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు పర్చూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బాలిక ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. అనంతరం బాలికను తీసుకొచ్చి విచారించగా అధ్యాపకుడే ఆమెను తీసుకు వెళ్ళినట్లు నిర్ధారణ అయింది. దీంతో కేసును ఫోక్సో కేసుగా నమోదు చేశారు. అందులో భాగంగా నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

## బ్రాందీ షాపులో రూ.5వేలు చోరీ

**ప్రజాశక్తి-తర్లుపాడు**

బ్రాందీ షాపులో రూ.5 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సిఐ బుజ్జిబాబు తెలిపారు. తర్లుపాడు రైల్వే స్టషన్ ప్రాంతంలోనున్న ప్రభుత్వ బ్రాందీషాపుపైకు సిమెంట్ రేకులను పగులగొట్టి రూ.5 వేల నగదు తీసుకెళ్లినట్లు సిఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## డ్రిప్ పైపులు చోరీ

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

పుల్లలచెరువు మండలంలోని నరముల తండాలో రూ. మూడు లక్షల విలువైన డ్రిప్ పైపులను గుర్తుతెలియన వ్యక్తులు అహరించారు. నరజాముల తండాకు చెందిన లక్ష్మానాయక్ తనకున్న ఐదు ఎకరాల పొలంలో డ్రిప్ వేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నాడు. పంటలు చివరికి రావడంతో పొలం బాగు చేయాలనే ఉద్దేశంతో డ్రిప్ పైపులను పక్కన పెట్టుకున్నాడు. గురువారం పొలం వెళ్లి చూసే సరికి డ్రిప్ పైపులు కనిపించలేదు. వాటిని దొంగలు తీసుకెళ్లారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు లక్ష్మానాయక్ తెలిపారు. చోరీకి గురైన పైపుల విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని తెలిపాడు

## నిధులు కేటాయించాలని వినతి

**ప్రజాశక్తి - కొల్లూరు**

గ్రామ పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించుకునేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు ఆధ్వర్యంలో విజయవాడలో పంచాయతీరాజ్ మంత్రి ముత్యాల నాయుడును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. పంచాయతీ అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించాలని కోరారు. స్పందించి మంత్రి ఈ విషయయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.కష్ణమోహన్ తెలిపారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - పంగులూరు**

విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో మండల పరిధిలోని తొమ్మిది గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం ఉదయం పదిన్నర గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. చందలూరు ఫీడర్ పరిధిలోని పొలల్లో సుబాబుల్ చెట్లు కొడుతుండగా అవి విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో సబ్ స్టేషన్‌లోని సిటీ మరమ్మతులకు గురైంది. దీంతో పంగులూరు, చందలూరు, ఆరికట్ల వారి పాలెం, కోటపాడు, కళ్ళం వారి పాలెం, బూదవాడ ,జనకవరం, కొండమంజులూరు, చిన్న మల్లవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వేసవి నేపథ్యంలో విద్యుత్ లేక ప్రజలు ఉక్క పూతతో ఇబ్బందులు పడ్డారు.

# పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి కృషి : జేసీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించే బాధ్యత పశు వైద్యాధికారులపై ఉందని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ చెప్పారు. స్థానిక జిల్లా పశువైద్యశాఖ కార్యాలయంలో ప్రపంచ పశువైద్య దినోత్సవం గురువారం నిర్వహించారు. తొలుత జ్యోతి వెలిగించి ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం పశువైద్య అధికారులు, సిబ్బంది రెడ్ క్రాస్ సహకారంతో రక్తదానం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పంపిణీ చేస్తున్న పరికరాలు, యంత్రాలు, వైద్యసేవలు వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శనను జేసీ ప్రారంభించారు. దీర్ఘకాలం పశువైద్యశాఖలో సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత పశు సంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ వెంకట పున్నయ్య, వెంకటేశ్వర్లు, డాక్టర్ రాగూర్‌కు శాలువలు కప్పి పుష్పమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు.

మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన వివిధ క్రీడల్లో గెలుపొందిన వైద్య అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. సంచార శాలలతో పశు పోషకుల ఇంటివద్దకు వెళ్లి వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. బాపట్ల జిల్లాలో పశువైద్య సేవలందించడంలో నూరు శాతం లక్ష్యాన్ని 200 శాతానికి చేరుకోవడం సంతోషదాయకమన్నారు. పశు సంపద అభివృద్ధికి నూతన శాస్త్ర సాంకేతిక విధానాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎమ్. హనుమంతరావు తెలిపారు. పశుదాణ భద్రతా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్ధంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా డీడీ రమేష్ బాబు, తెనాలి డీడీ కేదారేశ్వరరావు, ఇఒడిఎల్‌డిఒ కాలేషా, పశువైద్య శాఖ ఏడీలు, అసిస్టెంట్ సివిల్ సర్జన్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెసి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బాపట్ల

ఇంటర్ ఫలితాలలో బాపట్ల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభ చూపారు. బైపిసిలో బిళ్ళ ఆకాష్ ఇమ్మానుయేలు రాజు 985, బి. నాగలక్ష్మి 982, ఎస్‌కె. అఫ్రీన్ సుల్తానా 978, ఐ.పూజిత 972 మార్కులు సాధించారు. ఎంపిసి విభాగంలో అబ్దుల్ రహీమ్ 985, సుల్తానాబేగం 973 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని.శ్రీనివాసరావు, కార్యదర్శి మనం నాగేశ్వరరావు , కొమ్మినేని హరిపద్మప్రసాద్, దొప్పలపూడి రామ్మోహన్, గెల్లి దిలీప్, తాళ్లూరి రామకష్ణ తదితరులు అభినందించారు.

## డ్రీమ్స్ విద్యార్థుల హవా

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పూసపాడులోని డ్రీమ్స్ కళాశాల విద్యార్థులు తమ హవా సాటారు. సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో ముగ్గురు విద్యార్థులు 462 మార్కులు సాధించారు. 400కు పైగా 12 మంది విద్యార్థులు సాధించారు. బైపిసిలో 431/440 మార్కులు సాధించారు. 420 మార్కులు ఇద్దరు విద్యార్థులకు సాధించారు. 400కిపైగా నలుగురు విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో 988/1000 మార్కులు సాధించారు. 988 మార్కులు ఇద్దరు విద్యార్థులు సాధించారు. 950కి పైగా 10 మంది, 900కి పైగా మార్కులు 16 మంది మార్కులు సాధించారు. సీనియర్ బైపిసిలో 981/1000 మార్కులు సాధించారు. 950కి పైగా ముగ్గురు విద్యార్థులు, 900కి పైగా ఏడుగురు విద్యార్థులు సాధఇంచారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం పేర్ని రాధాకృష్ణ, పేర్ని సతీష్ చంద్ర అభినందించారు.

## 'సూర్య కళాశాల' ప్రభంజనం

ఆదర్శ అకాడమీ ఆధ్వర్యంలో సూర్య కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. తమ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో కె.నాగమల్లిక 452 మార్కులు సాధించింది. 400 పైగా మార్కులు 12 మంది విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో అపర్ణ సాహు 978/1000 మార్కులు సాధించింది. 900 మార్కులకు పైగా 9 మంది విద్యార్థులు సాధించారు.

## శ్రీగౌతమి విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో ఇంకొల్లులోని శ్రీ గౌతమి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపిసి విభాగంలో జి.నవ్యశ్రీ, జి.నాగశ్రీ 978/1000 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు ఎం.వి వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, షేక్ మొబిన్ అభినందించారు.

## మేధావి విద్యార్థుల ప్రభజనం

ప్రజాశక్తి-చీరాల

ఇంటర్ పరీక్ష ఫలితాలలో శ్రీమేధావి జూనియర్ కాలేజి విద్యార్థులు అత్యధిక మార్కులతో ప్రభజనం సృష్టించినట్లు శ్రీ మేధావి విద్యా సంస్థ అధినేత ఎంవి. దుర్గా కుమార్ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో టి. సాహితి 463 మార్కులు, బైపిసిలో ఎల్. కనకదుర్గ 428 మార్కులు, సిఇసిలో ఆర్.మహిమరాజు 413 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో ఇ.పుష్ప 982 మార్కులు, బైపిసిలో టి.రజని 975, ఎంఇసిలో ఎన్.లహరి 908, సిఇసిలో షేక్ ఇంతియాజ్ 935 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థ అధినేత దుర్గా కుమార్, ప్రిన్సిపల్, సత్యన్నారాయణ, ఎఐ. అవినాష్, సూర్య తేజ, ప్రసాద్, యు. గోపి కష్ణ, వైస్ ప్రిన్సిపల్ షేక్ అహ్మద్ అభినందించారు.

## సత్తా చాటిన శ్రీగౌతమి విద్యార్థులు

ఇంటర్ ఫలితాలలో శ్రీ గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో టి.హారిక, సిహెచ్.యామిని 988 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో తమ విద్యార్థి 429 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎంపిసి విభాగంలో ఎం.రామ్ చరణ్ 463 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ఎమ్‌డి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## నిందితులకు శిక్ష పడాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

కోర్టులో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్లు అవుతుందని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి వర్చువల్ విధానములో జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీ చట్టం అమలు, ప్రాపర్టీ కేసుల గురించి, సర్కిల్ వారీగా ఏర్పాటు చేసిన క్రైమ్ పార్టీల పనితీరు, రోడ్డు ప్రమాదాలు, కోర్టుల్లో ట్రయిల్ జరుగుతున్న కేసుల గురించి, విచారణ దశలో వున్న కేసులు, బాలబాలికల, మహిళల మిస్సింగ్ కేసులు, సిసి కెమెరాల ఏర్పాటు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల గురించి సమీక్షించారు.గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిస్థాయిలో అరికట్టడానికి తగిన పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి విక్ర యాలను సమూలంగా అరికట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి పి.మహేష్ , డిసిఆర్‌బి డిఎస్‌పి లక్ష్మయ్య , బాపట్ల ,చీరాల, రేపల్లె డిఎస్‌పిలు ఎ.శ్రీనివాస్ రావు, పి.శ్రీకాంత్, టి.మురళీకృష్ణ, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ పి.మురళీకృష్ణ, సిఐలు,ఎస్‌లు పాల్గొన్నారు.

## ఎంఇఒపై ఆర్‌జెడికి ఫిర్యాదు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ఆర్‌జెడికి ఫిర్యాదు చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

బాపట్ల జిల్లా బల్లికురవ ఎంఇఒ బండ్ల వీరరాఘవయ్య ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తూ అవినీతి, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డాడని ఆయన సస్పెండ్ చేయాలని కోరుతూ గుంటూరు విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావుకు ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు ఆధ్వర్యంలో యుటిఎఫ్ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంఇఒ వీర రాఘవయ్య 2017 మార్చి 27న విధుల్లో చేరినప్పటి నుంచి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అదేమని అడిగిన ఉపాధ్యాయులను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల జీతభత్యాములకు సంబంధించి డిడిఒ అకౌంట్ల నుంచి లక్షలు డ్రా చేసి దుర్వి నియోగానికి పాల్పడినట్లు తెలిపారు. ఎంఇఒ అవినీతిపై విచారణ జరిపి తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు, కోశాధికారి వెంకటేశ్వర్ రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి- అద్దంకి

దాతను సన్మానిస్తున్న దృశ్యం

సృజన ఆధ్వర్యంలో అద్దంకి శాఖా గ్రంథాలయానికి రూ.10వేల విలువైన 108 పుస్తకాలు బహూకరించారు. మద్దిపాడుకు చెందిన విశ్రాంత గ్రంథ పాలకులు గంగిశెట్టి నరసింహారావు తాను సేకరించిన వివిధ గ్రంథాలను అద్దంకి గ్రంథ పాలకుడు సుగుణ రావుకు గురు వారం అందజేశారు. ఈ సందర్భంగా గంగిశెట్టి నరసింహారావు మాట్లా డుతూ తెలుగు భాషపై అభిమానం కలిగిన వారికి రాబోయే యువతరానికి ఈ గ్రంథాలు ఎంతోగానో ఉపయోగ పడతాయని ఆయన తెలిపారు. అనంతరం పుస్తకాల దాత నరసింహారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో సజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్ దత్ , కార్యదర్శి కేశవమటం అనిల కుమారసూరి, గ్రామ పెద్దలు ఉబ్బా దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, అద్దంకి లెవి ప్రసాద్, షేక్ మహమ్మద్ రఫీ, తాళ్లూరి బాబూరావు, మందా జోసెఫ్, మాచిరాజు వీరరాజు, కూరపాటి రామకోటేశ్వర రావు పాల్గొన్నారు.

## రంగస్థల నటి బండారు సుశీల మృతి

అద్దంకి : ప్రముఖ రంగస్థలం నటి, గాయనిబండారు సుశీల(87) బుచ్చిరెడ్డి పాలెం మండలంలో రేపాల గ్రామంలో వయోభారంతో గురువారం మృతిచెందారు. ఆమె రాష్ట్రంలోనే కాక దేశంలో కొన్ని వేల డ్రామాలు ప్రదర్శించి అవార్డులు, రివార్డులు అందుకున్నారు. గత నెలలో తెనాలి నాటక సంఘం నుంచి ఉగాది పురస్కారం అందుకున్నారు. మృతురాలు ప్రముఖ రంగస్థలం నటుడు కీర్తిశేషులు బండారు రామారావు సతీమణి. సుశీల చంద్రమతి పాత్రకు ప్రాణం పోసిన తొలి మహిళ. సుశీల మృతికి పలువురు కళాకారులు, కళాభిమానులు తమ సంతాపాన్ని తెలిపారు.

బండారు సుశీల (ఫైల్)

## భగీరథ మహర్షికి ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

లక్ష్యసాధనకు భగీరథమహర్షి చేసిన ప్రయత్నం దేశ సమాజానికే ఆదర్శనీయమని జిల్లా సంయుక్త కలెక్టరు చామకూరి శ్రీధర్ అన్నారు. భగీరథ మహర్షి జయంతి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి చిత్రపటానికి జిల్లా సంయుక్త కలెక్టరు శ్రీధర్, డిఆర్‌ఒ కె.లక్ష్మీశివజ్యోతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయాలకోసం ప్రయత్నించే ప్రతిఒక్కరూ భగీరథ మహర్షిని స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టరు చెప్పారు. ఉన్నతస్థాయికి వెళ్లాలంటే భగీరథుడి మాదిరిగా కష్టపడినప్పుడే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ ఛైర్మన్ బి.సురేంద్రబాబు, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి కల్పన, కలెక్టరేట్ ఎఒ సుశీల, నగరసంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్. సుబ్బారావు, వి.శ్రీనివాసరావు, జి.పోతురాజు, ఎన్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి- బాపటజిల్లా

దేదీప్యసాయిని అభినందిస్తున్న కలెక్టర్

ఇంటర్ ఫలితాల్లో బాపట్ల విజిఆర్ఎం జూనియర్ కళాశాల విద్యార్థిని ఆర్. దేదీప్యసాయి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. 989/1000 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తన కార్యాలయంలో దేదీప్యసాయిని గురువారం అభినందించారు. ఉన్నత చదువులు చదివి మరిన్ని ర్యాంకులు సాధించాలని కలెక్టరు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ వత్తి విద్యా విద్యాశాఖ అధికారి ఆంజనేయులు, విజిఆర్ఎం కళాశాల డైరెక్టర్ అంబటి గిరిధర్, ఆదేళ్ల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
5
శుక్రవారం 28 ఏప్రిల్ 2023

## 'సాయిరామ్' విద్యార్థుల జయభేరి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో శ్రీ సాయిరామ్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ భేరి మోగించారు. కళాశాలలో సాధారణ విద్యార్థులను అసాధారణ ఫలితాలను రాబట్టారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపిసి విభాగంలో 470కి 465 మార్కులను గడ్డం అమృత, బైపిసి విభాగంలో 440కి 432 మార్కులను కొప్పర్తి అమృత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల ఎంపిసి విభాగంలలో 1000కి 988 మార్కులను ఉట్లపల్లి మేఘన, బైపిసి విభాగంలో 1000కి 981 మార్కులను బండి వెంకట ప్రణవ యామిని సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అంజయ్య మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఫలితాలలో 460కి పైగ ఆమార్కులను ఏడుగురు విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 950కి పైగా మార్కులను ఐదుగురు విద్యార్థులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్‌లో 92.07 శాతం ఉత్తీర్ణతను, సీనియర్ ఇంటర్‌లో 94.23 శాతం ఉత్తీర్ణతను సాధించామన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, సహకరించిన అధ్యాపక, అధ్యాప కేతర సిబ్బందిని డాక్టర్ కరి అంజయ్య అభినందించారు.

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

## వైసిపికే పట్టం కట్టాలి: మద్దిశెట్టి

ప్రజాశక్తి-దరిశి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం ద్వారా అర్హులైన పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు చూసి వచ్చే ఎన్నికలలో వైసిపికి పట్టం కట్టాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దరిశిలోని 4వ సచివాలయం పరిధిలో పుట్లబజారు నందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరై ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి చైర్మన్ వైవి సుబ్బయ్య, మండల కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్రకార్పోరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, కౌన్సిలరు విసిరెడ్డి, కమీషనరు మహేష్, నాయకులు నాగమణి, హరీష్, రెహమాన్, సాంబయ్య పాల్గొన్నారు.

ప్రచారభేరిలో సిపిఎం, సిపిఐ నాయకులు

## నేడు బహిరంగ సభ

ప్రజాశక్తి-దరిశి

మోడీ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 28న చౌటపాలెం రోడ్‌లో బహిరంగసభ జరుగుతుందని, దానిని కార్య కర్తలు జయప్రదం చేయాలని సిపిఐ, సిపిఎం నాయ కులు జూపల్లి కోటేశ్వరరావు, సందు వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం దరిశి పట్టణంలో ప్రచారభేరి కార్య క్రమం జరిగింది. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర రావు, ఉప్పునారాయణ, హనుమంతరావు, జాన్, సుబ్బారావు, కరుణానిధి, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

## పెదకండ్లగుంటలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి..'

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో టిడిపి నేతలు 'మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పెదకండ్లగుంట గ్రామ కమిటీ అధ్యక్షులు కల్లూరి మల్లిఖార్జునరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్యపై త్రీమెన్ కమిటీ విచారణ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అప్పుల బాధను తట్టుకోలేక గత నెల 20వ ఆత్మహత్య చేసుకున్న రైతు గొలమారి కోటిరెడ్డి స్వగ్రామం అయిన మాలపాటిపల్లె గ్రామంలో త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మృతుడు కోటిరెడ్డి భార్య వద్ద నుండి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. తమ నివేదికను ప్రభుత్వానికి పంపి ఆ రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కమిటీ లో మండల వ్యవసాయ అధికారి ఏ.ఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, మార్కాపురం గ్రామీణ ఎస్ఐ ఆర్.సుమన్, డిప్యూటీ తహశీల్దార్ యం. హరిబాబు, ఆర్.ఐ బి.వి రమణ, వి.ఆర్.ఓ లు శివ పార్వతి, రఫీ హాజరయ్యారు.

విచారణ చేస్తున్న అధికారులు

# కాశిరెడ్డి కృషి అభినందనీయం: ఎంఇఒ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

విద్యాబోధనతోపాటు పాఠశాల అభివృద్ధికి గాయం కాశిరెడ్డి చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని ఎంఇఓ ఎస్‌కె.ఢాంగీరషీఫ్ అన్నారు. గురువారం స్థానిక ఎంపిపిఎస్, ఎఎ పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎల్ఎఫ్ ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు అబ్దుల్‌హై మాట్లాడుతూ కాశిరెడ్డి క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని, తన విధులను సక్రమంగా నిర్వహిస్తూ పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపి విద్యార్థులకు విద్యతోపాటు మంచి వాతావరణాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అనంతరం ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత గాయం కాశిరెడ్డి దంపతులను యుటిఎఫ్ జిల్లా నాయకులు, సహోపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మాజీ మండల అధ్యక్షులు, ఉపాధ్యాయులు మంచికల కోటేశ్వరరావు, ఎంఇఓ ఎస్‌కె.ఢాంగీరషీఫ్, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు అబ్దుల్‌హై, జెవివి పొదిలి ఏరియా నాయకులు దాసరి గురుస్వామి, ఎపిటిఎఫ్‌మాజీ మండల అధ్యక్షులు మంచికల కోటేశ్వరరావు, కొనకనమిట్ల కాంప్లెక్స్ కార్యదర్శి పోలా శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



కాశిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

## గీతాంజలి విద్యార్థుల విజయదుందుభి

ప్రజాశక్తి-దరిశి

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో స్థానిక గీతాంజలి జూనియర్ కాలేజి విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఇంటర్ ఎంపిసిలో ఎ. యసస్విని 989/1000 మార్కులు, ఫస్ట్ ఇయర్ ఎంపిసి విభాగంలో పి. లక్ష్మీ దేవరాజ్ 468/470 మార్కులు సాధించారు. అదేవిధంగా సెకండరీయర్ ఎంపిసిలో వై. ఉదయలక్ష్మి 985/1000 మార్కులు, ఫస్ట్ ఇయర్‌లో జగదీష్ 463/470 మార్కులు సాధించారు. వీరిని కాలేజి యాజమాన్యం కె. ఆదినారాయణ, సుధాకరరెడ్డి, రమణారెడ్డి, రవికాంత్‌రెడ్డిలు అభినందించారు. పిఆర్‌కెఆర్ మహిళా జూనియర్ కాలేజి నందు ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో షేక్ జబీదా 983/1000 మార్కులు సాధించి టౌన్‌ఫస్ట్ నిలిచారు. బైపిసి విభాగంలోనే షేక్ షైనాజ్ 963/1000 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో తమ్మిశెట్టి వరలక్ష్మి 457/470 మార్కులు, పల్లె అంకిత 443/470 మార్కులు సాధించారు. ఈ విద్యార్థులను కాలేజి ప్రిన్సిపాల్ కె. రాజశేకరరెడ్డి, అధ్యాపకబృందం అభినందించారు.

## 'యశ్వంత్' కళాశాల విద్యార్థుల విజయం

ప్రజాశక్తి-బేస్తవారిపేట

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక యశ్వంత్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం ఇంటర్ ఎంపిసిలో జి మనుతేజ 470 మార్కులకు గాను 455 మార్కులు సాధించాడు.. బైపిసి విభాగంలో టి ధరణి 440కిగాను 422 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ విభాగంలో బైపిసి విభాగంలో టి.చెల్సియా మెకియా 1000 మార్కులకు గాను 965, ఎంపిసిలో సిహెచ్ భార్గవి 938 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఆవుల కృష్ణారెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## ఖాశిం మృతి తీరని లోటు

### మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

పట్టణంలో తెలుగుదేశంపార్టీలో సీనియర్ నాయకులుగా ఉంటూ మాజీ మంత్రి కాటూరి నారాయణస్వామి అనుచరుడుగా పనిచేసిన ముల్లా ఖాశిం మరణం పార్టీకి తీరని లోటని మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. గురువారం పొదిలి పట్టణమును చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముల్లా ఖాశిం మృతిచెందారు. ఈ సందర్భంగా కందుల ఖాశిం పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## 'చైతన్యభారతి' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో చైతన్య భారతి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మొదటి ఏడాది ఇంటర్‌లో పిరామాంజనేయులు 470కు 450 మార్కులు, బి దుర్గానాగమల్లేశ్వరి 439 మార్కులు, జి శ్రావ్య 439 మార్కులు, రెండవ ఏడాది ఇంటర్‌లో ఏ సాయిచరణ్ 961, పి గోపికృష్ణ 961 సాధించారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నాగళ్లశ్రీనివాసులు మరియు అధ్యాపకులు అభినందించారు.

## ఇంటర్‌లో 'వివేకానంద' విజయభేరి

ప్రజాశక్తి-పొదిలి

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో స్థానిక శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎన్.పల్లవి 470కి 464 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సాధించింది. బైపిసి విభాగంలో ఎం.శరణ్య 440 మార్కులకు గాను 430 మార్కులు పొదిలి పట్టణ స్థాయిలో అన్ని గ్రూపులలో టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. సిఇసి విభాగంలో కె.రజిత 500కు గాను 456 మార్కులు సాధిం చారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఆర్‌విసాయి 980, బైపిసిలో వి శివాని 958, సిఇసిలో సి సుబ్బలక్ష్మి 938 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలి పారు. ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులను యాజమా న్యం అభినందించింది. గురువారం కళాశాల ఆవరణలో జరి గిన కార్యక్రమంలో విద్యార్థులకు డైరక్టర్, విశ్రాంత ఎంఇఓ యలమందారెడ్డి మిఠాయిలు పంచి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## 'లక్ష్య' విద్యార్థుల విజయదుందుభి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో గుంటూరు, విజయవాడ నందలి లక్ష్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయాలను కైవసం చేసుకున్నారని లక్ష్య విద్యా సంస్థల చైర్మన్ గుంటక మల్లిఖార్జునరెడ్డి అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసి విభాగంలో షేక్ ఫిరోజ్ 465/470, బైపిసి విభాగంలో ఎస్ శశిధర్, డి శాలిని, జె లక్ష్మీ స్వర్ణరెడ్డి 433/440, సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో షేక్ మస్తాన్‌వలి 989/1000, ఎంపిసి విభాగంలో షేక్ కరిసా 983/1000 మార్కులు సాధించారని తెలిపారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

## ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని నర్శింగోలు గ్రామంలోని తెల్లపాటి కుంటలో జరుగు ఉపాధిహామీ పథకం పనులను జరుగుమల్లి ఎంపిడిఓ పి.రామకృష్ణ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఈసి.నరశింహారావు, టిఎ సురేష్ పాల్గొన్నారు.

## టైలర్స్ కాలనీలో 'జగనన్నే మా భవిష్యత్'

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు జగనన్నతోనే సాధ్యమవుతుందని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టైలర్స్ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం కార్యక్రమం జరిగింది. మాజీ పట్టణ అధ్యక్షులు, రెండో వార్డు ఇన్చార్జి షేక్ రబ్బాని ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైకాపా రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి పాల్గొని జగనన్న నాలుగేళ్ల పాలనలో జరిగిన అభివద్ధిని ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు వేల్పుల దాసు, వేల్పుల నగేష్, బి ఖాసిం పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-రేపల్లె

పి.సుధాకరరావు

ఇంటర్ ఫలితాల్లో పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ఫలి తాలు సాధించారని ప్రిన్సిపాల్ పి.సుధాకరరావు అన్నారు. తమ కాలేజీ విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ కాలేజీల్లో జూనియర్ ఇంటర్‌లో మొదటి స్థానం, సీనియర్ ఇంటర్‌లో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలను 41 మంది రాయగా 22 మంది (54 శాతం) ఉత్తీర్ణతతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి స్థానం పొందారని, ఎంపిసిలో 13 మందికి 12 మంది (92.3 శాతం) ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 42 మంది రాయగా 21 మంది (50 శాతం) ఉత్తీర్ణత సాధించారని, ఎంపిసిలో 14 మందికిగాను 12 మంది (82 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఎంపిసిలో కె.అనిల్ 984 మార్కులతో రాష్ట్రంలోని మొదటి స్థానం సాధించారని, అనిల్‌ను అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన అమరావతి విఐటి ఇంజినీరింగ్ కాలేజీలో చేరు స్తామని ప్రకటించారు. ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు సైతం 69 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

## వాగ్దేవి విద్యార్థినుల విజయభేరి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని వాగ్దేవి బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు వెలువడిన ఇంటర్ ఫలితాల్లో విజయ భేరి మోగించారు. ఎంపిసి, సీఈసీ గ్రూపుల నందు టౌన్ ఫస్ట్ సాధించారు. మొదటి సంవత్సరం ఎంపిసి గ్రూపులో వై భార్గవి 457/470, టి నాగలక్ష్మి 454/470, ఎం శ్రావణి 422/470, పి ఆంజలి 410/470, సీఈసీ గ్రూపు నందు పివి రామాంజలి 404/500 టౌన్ ఫస్ట్ సాధించింది. సీనియర్ ఇంటర్ ఎంపిసి నందు కె నందిని 954/1000, కె సృజన 943/1000, డి నాగ మల్లేశ్వరి 934/1000, పివి రమణాలు 911/1000, సీఈసీ నందు పి మౌనిక 925/1000, జివిసికె నందిని 900/1000, డి బైపిసి గ్రూప్ నందు వెంకటలక్ష్మి 923/1000 మార్కులు సాధించి విజయ భేరి మోగించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ కందుకూరి అంకమ్మరావు, ఏవో పి బాలు నాయక్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

## చలివేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రరెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు అందరూ వేసవికాలంలో సేవా కార్యక్రమాలను ఉదతం చేయాలన్నారు. కార్యక్రమంలో నందనవనం ఎంపీటీసీ నారాయణస్వామి, హనుమంతునిపాడు ఉపసర్పంచ్ కత్తి కిషోర్, మాజీ ఎంపిటిసి వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, రవీంద్రారెడ్డి, వైసిపి నాయకులు మూలె గోపాల్‌రెడ్డి, ఫణీంద్రరెడ్డి, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'సొసైటీ' అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రెడ్డి

**ప్రజాశక్తి-త్రిపురాంతకం**

త్రిపురాంతకం ప్రాథమిక పరపతి సంఘం ప్రెసిడెంట్‌గా దగ్గుల వేణుగోపాల్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డిని గ్రంథాలయ చైర్మన్ పిచ్చయ్య యాదవ్, త్రిపురాంతకం మండలం ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు సింగారెడ్డి పోల్‌రెడ్డి పూలమాలలతో సత్కరించారు.

## మానవ హక్కుల కమిషన్ ఇన్‌ఛార్జిగా పాపారాయుడు

**ప్రజాశక్తి-కనిగిరి**

విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంకల్పవేదిక ఆధ్వర్యంలో హ్యూమన్‌రైట్స్ ఆర్‌టిఐ సంయుక్త అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో కనిగిరికి చెందిన కేటిసి స్టడీ సర్కిల్ డైరక్టర్ కేటిసి పాపారాయుడు హ్యూమన్‌రైట్స్ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైనారు. ఆ మేరకు నియామకపత్రాన్ని ఏపి హైకోర్టు న్యాయవాది ఎం రగసాయిరెడ్డి చేతులమీదుగా ఆయన అందుకోవటం జరిగింది. మానవహక్కుల పరిరక్షణక పాటుపడతానని కేటిసిపాపారాయుడు తెలియజేశారు.

## వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

**ప్రజాశక్తి-కనిగిరి**

108 సిబ్బంది వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పివి శేషయ్య ఉన్నతాధి కారులను ఒక ప్రకటనలో కోరారు. గత మూడు నెలల నుంచి వేతన బకాయిలు ఉండటంతో వారు కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హెూలిగుందలో పనిచేస్తున్న ఎస్ఎస్‌వినోద్ తనపై అధికారికి రాజీనామా లెటర్ పంపటం విచారకరమన్నారు. మరోవైపు సిబ్బందికి చెందిన ఫిఎఫ్ అమలుకు యాజమాన్యం తన వాటాను చెల్లించకుండా కార్మికుల నుండే రాబట్టిన విషయంపై అధికారులకు తెలిసినా మౌనం వహించటం దారుణమన్నారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి 108 సిబ్బందిని గట్టేక్కించేలా చర్యలు చేపట్టి.. ఆదుకోవాలని కోరారు.

## 'విశ్వబ్రాహ్మణ' కమిటీ ప్రమాణస్వీకారం

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరి పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామిలో ప్రకాశంజిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అధ్యక్షతన కనిగిరి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షునిగా చలికిచెర్ల ప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా నిమ్మకూరి మాల్యాద్రి, కోశాధికారిగా కనకరత్నచారితో పాటు 15 మంది సభ్యులు ఎంపిక కావటం జరిగింది. విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషిచేస్తామని నూతన కమిటీ తెలియజేశారు.

# ఉమ్మడి కమ్యూనిస్టు యోధుడు 'రావూరి'..

**ప్రజాశక్తి-టంగుటూరు**

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో అనేక పోరాటాలలో కీలకపాత్ర పోషించిన పోరాట యోధుడు రావూరి వెంకట సుబ్బయ్య అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజ నేయులు తెలిపారు. సిపిఎం సానుభూతి పరుడు, టంగుటూరులో రావూరి వినీల ఫౌం డేషన్ చైర్మన్ రావూరి వెంకటసుబ్బయ్య (87) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. వెంకటసుబ్బయ్యకు భార్య కోటమ్మతో పాటు నలుగురు కుమారులు ఉన్నారు. పూనాటి ఆంజనేయులు గురువారం టంగుటూరులోని చెల్లెమ్మ తోటలో వెంకటసుబ్బయ్య స్వగృహం వద్దకు విచ్చేసి వెంకటసుబ్బయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. వెంకటసుబ్బయ్య సతీమణి కోటమ్మ, కుటుంబసభ్యులను పూనాటి ఆంజనేయులు పరామర్శిం చారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం మండల కన్వీనర్ వేసుపోగు మోజెస్, సిఐటియు జిల్లా కార్యదర్శి టంగుటూరి రాము ఉన్నారు.

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి**

వెంకటసుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పూనాటి

**దామచర్ల సత్య పరామర్శ**

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, పట్టణ అధ్యక్షులు కామని నాగశ్రీను వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. గురువారం టంగుటూరులో వెంకటసుబ్బయ్య అంత్యక్రియలు నిర్వహించారు.

# ఇంటర్‌లో 'శ్రీ చాణక్య' విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాశక్తి-కొండపి**

ఇంటర్ మీడియట్ బోర్డు ప్రకటించిన ఇంటర్ పరీక్షా ఫలితాలలో స్థానిక కొండపి శ్రీ చాణక్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ పలితాలు సాధించారు. మంచి మార్కులు సాదించిన విద్యార్థులను గురువారం కళాశాలలో వారి అధ్యా పకులను కళాశాల కరస్పాండెంట్ పి.రాజ్యలక్ష్మి అభినందించారు. మొదటి సంవత్సరంలో 81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాదించారని, అందులో షేక్ షబీహారు క్నాన(యంపిసి) 453, యెనిమిరెడ్డి రాజేశ్వరి (యంపిసి) 445, షేక్ ఫర్జానా (బైపిసి) 423, రాజారపు వెంకట ప్రసన్నలక్ష్మి (బైపిసి) 416, దారా మనీషా (సిఈసి) 425 మార్కులు సాధించారని పేర్కొన్నారు. 400 మార్కు లకు పైగా 20 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో జి.కార్తీక్ (యంపిసి) 937, లావణ్య (బైపిసి) 940 మార్కులు సాధించారని తెలిపారు.

**'గురుకుల' విద్యార్థుల ప్రతిభ**

స్థానిక కొండపి గురుకుల కళాశాల విద్యార్థినులు ఇంటర్ పరీక్షా ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించారని ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపాల్ ఆర్.కోటేశ్వరరావు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 72 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా అందులో 31 మంది పాస్ అయ్యి 84.72 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో బైసిపిలో 36

విద్యార్థులను అభినందిస్తున్న చాణక్య కళాశాల ప్రిన్సిపల్

మందికి 31 మంది, యంపిసిలో 36 మందికి 30 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో బైసిపిలో సిహెచ్ లావణ్య 939 మార్కులు, యంపిసిలో టి.వర్షిత 966 మార్కులు సాధించడం జరిగిందన్నారు. ప్రథమ సంవత్సరంలో 76 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 54 మంది ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. వారిలో యంపిసిలో 36 మందికి 18, బైపిసిలో 40 మందికి 36 ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అందులో యంపిసిలో ఈ.స్వప్న 443 మార్కులు, బైపిసిలో స్వాతి లక్ష్మి 422 మార్కులు సాధించినట్లు తెలిపారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..**

కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 127 మంది పరీక్షలు రాయగా అందులో 58 మంది పాసై 45.3 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో నల్లమల కుసుమ 921 మార్కులు, ప్రథమ సంవత్సరంలో తన్నీరు దివ్య 413 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యం.వెంకటేశ్వర్లు తెలిపారు.

## రాష్ట్ర కోఆప్టేటెడ్ సభ్యురాలిగా ప్రియదర్శిని

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

ప్రియదర్శిని

జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆప్టేటెడ్ సభ్యురాలిగా మార్కాపురం మండలం వేములకోట గ్రామానికి చెందిన బి.ఇందిరా ప్రియదర్శిని (హిమబిందు రెడ్డి) నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం నుండి అధికారంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర కో ఆప్టేటెడ్ సభ్యురాలిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రుణపడి ఉంటానని అన్నారు.

## గిద్దలూరు తహశీల్దార్‌గా విజయకుమారి

**ప్రజాశక్తి-గిద్దలూరు**

తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కమిషనర్

గిద్దలూరు మండల నూతన తహశీల్దార్‌గా కె. విజయకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ పుష్పగుచ్ఛం అందజేసి.. శుభాకాంక్షలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కషి చేస్తానన్నారు.

విద్యార్థులకు స్వీట్ తినిపిస్తున్న ప్రిన్సిపల్ వెంకటరెడ్డి

## 'ఎంఎస్‌ఆర్' విద్యార్థుల విజయభేరి

**ప్రజాశక్తి-కనిగిరి**

ఇంటర్ ఫలితాల్లో కనిగిరి ఎంఎస్‌ఆర్ కళాశాల విద్యార్థినులు విజయభేరి మోగించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ ఇంగ్లీష్ మీడియంలో గోదిన కళ్యాణి 982 మార్కులు, షేక్ నస్రిన్ 981 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో జొన్నలగడ్డ చిన్నతల్లి 978 మార్కులు, సిఇసి విభాగంలో పెరుగు మాలిని 930 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ ఇంగ్లీస్ మీడియంలలో షేక్ సమీరా 459 మార్కులు, బైపిసి ఇంగ్లీష్ మీడియంలో డోగుపర్తి నాగూబీ 426 మార్కులు, వీరంరెడ్డి భాను 424 మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి, అధ్యాపకులు స్వీట్లు తినిపించి.. అభినందించారు.

**ఎంఎన్‌ఎం విజేత విద్యార్థుల సత్తా..**

కనిగిరి ఎంఎన్‌ఎం విజేత కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బివిఎస్ మారుతీ 462, బైపిసిలో నంబుల మానస 423, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో అబ్దుల్ సమాద్ 985, బైపిసిలో సయ్యద్ మెహతాజ్ 974 మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ పి.అరుణోధర్ తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, అధ్యాపకులు అభినందించారు.

మంత్రి సమక్షంలో వైసిపిలో చేరిన యువకులు

## మంత్రి సురేష్ సమక్షంలో.. వైసీపీలోకి 30 కుటుంబాలు చేరిక

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

పుల్లలచెరువు మండలంలోని అక్కపాలెం గ్రామంలో గల టీడీపీ, జనసేనకు చెందిన 30 కుటుంబాలు రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సమక్షంలో గురువారం వైసీపీలో చేరారు. వైసీపీ చేస్తున్న సంక్షేమ పాలన పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారంతా ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రెంటపల్లి సుబ్బారెడ్డి, రోశిరెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

దోర్నాల మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, మల్లికార్జునపురం (మోట్లు) నందు ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ పరీక్షా ఫలితాలలో సత్తా చాటారు. గాలి పవిత్ర 446, బొజ్జా భార్గవి 445, బోజ్జా బాలాజీ 442 మార్కులను సాధించి దోర్నాల మండలంలోనే మొదటి, రెండవ, మూడవ స్థానంలో నిలిచారు. వారిని పాఠశాల ప్రిన్సిపల్ బివి సతీష్‌కుమార్ అభినందించారు. పాఠశాలకు ఇంత మంచి ఫలితాలు రావడానికి కారకులైన అధ్యాపక బందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## 'శ్రీ గౌతమి' విద్యార్థుల విజయఢంకా

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెంలోని శ్రీగౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో విజయఢంకా మోగించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో యర్రగొండపాలెం టౌన్ బైపిసి గ్రూప్‌లో 948 మార్కులతో తేజస్విని ప్రథమ స్థానం, 927 మార్కులతో దీపికారెడ్డి ద్వితీయ స్థానం, ఎంపిసి గ్రూప్‌లో 969 మార్కులతో పార్వతి ద్వితీయ స్థానం, ప్రథమ సంవత్సరం పరీక్షా ఫలితాలలో ఎంపిసి గ్రూప్‌లో 456 మార్కులతో సంతోష్ కుమార్ ప్రథమ స్థానం, 451 మార్కులతో యాస్మిన్, బైపిసి నందు 440కి 400 మార్కులతో విజయలక్ష్మి ద్వితీయ స్థానం, 399 మార్కులతో వెంకటయ్య మంచి ప్రతిభ కనబరిచారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కనుమర్ల గుండారెడ్డి, ప్రిన్సిపాల్ గుంటక త్రిపురారెడ్డి, అధ్యాపక బందం అభినందించారు.

## మండల కేంద్రాల్లోనే దరఖాస్తులు తీసుకోవాలి

**ప్రజాశక్తి-సిఎస్.పురం**

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించిన దరఖాస్తును మండల కేంద్రాల్లో స్వీకరించి.. దరఖాస్తుదారుల సమయం డబ్బు ఆదా చేసి వారికి సౌకర్యం కల్పించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి తెలిపారు. ఐద్వా మండల కమిటీ సమావేశం నారాయణస్వామి కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊసా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తుదారు వెలిగండ్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తల్లి లేక తండ్రి లేని పిల్లల విషయంలో వారికి సహాయంగా ఉండే గార్డెన్స్ కానీ ఈ పథకం దరఖాస్తు చేసుకునే క్రమంలో చాలామంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ఆయా మండల కేంద్రాలలో దరఖాస్తులు స్వీకరించాలని ఆమె కోరారు. సమావేశంలో ఎ.రమణమ్మ, పి.కొండమ్మ, ఎన్. రమణమ్మ, అంకమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 29న జరుగుమల్లి మండల సమావేశం

**ప్రజాశక్తి-జరుగుమల్లి**

జరుగుమల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిపి బెల్లం నిర్మల అద్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ పి.రామకృష్ణ తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలన్నారు.

# కూలీలు దొరక్క.. పంటలు ఎండుతూ..

## వైట్ బర్లీ, మిర్చి రైతుల ఆందోళన

**ప్రజాశక్తి-పర్చూరు**

వైట్ బర్లీ పొగాకు, మిరప పంటలు సాగు చేసిన రైతులకు కూలీల కొరత వెంటాడుతుంది. ప్రస్తుతం వైట్ బర్లీ, మిర్చి పనులు ఒక్క సారిగి రావటంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో కూలీలు దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు. ఇతర జిల్లాల నుంచి కూలీలను తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైట్ బర్లీ పొగాకు ఎండుముఖం పట్టటంతో ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారు. అధిక కూలి రేట్లు చెల్లించినా ఫలితం ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం వైట్ బర్లీ ఆకు కొట్టేందుకు కూలి రూ. 500 ఉంది. ప్రస్తుతం రూ.800 నుంచి రూ. 1,000 చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి కోతకు కూలీలు అందుబాటులో లేకపోవటంతో పొలాల్లోనే కాయలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో 20 వేల ఎకరాలకు పైగా వైట్ బర్లీ సాగు చేశారు. 30 వేల ఎకరాలకు పైగా మిర్చి సాగు చేశారు. మిర్చికి ఎకరానికి రూ. 1.5 లక్షల నుంచి రూ. 2 లక్షల మేర పెట్టుబడి పెట్టారు. వైట్ బర్లీ పొగాకుకు ఎకరానిఎికి రూ.లక్ష మేర పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి, వైట్ బర్లీకి మంచి డిమాండ్ ఉంది. వైట్ బర్లీ లోగ్రేడ్ పొగాకును క్వింటా రూ. 9 వేలకు కొనుగోలు చేస్తున్నారు. మిర్చి క్వింటా రూ. 25 వేలకు పైగా ఉంది.పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాల, కూలీల కొరత అన్నదాతలను వేధిస్తుంది. దీంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రత పెరిగి పోవటంతో చేతికి వచ్చిన పంటలు ఎండుముఖం పట్టటంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. పంటలు ఆశా జనకంగా ఉండటం, నాణ్యమైన దిగుబడి రావటంతో వైట్ బర్లీ. మిర్చి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే కూలీల కొరత శాపంగా వారికి మారింది. వైట్ బర్లీ పొగాకు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కళ్ళ ముందే పంటలు ఎండిపోతుండటంతో ఏమి చేయాలో అర్థం కాక లబోదిబో మంటున్నారు.

వాడుతున్న వైట్ బర్లీ పొగాకు

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### ప్రత్యేక అధికారి విలియమ్స్

**ప్రజాశక్తి-రేపల్లె**

సచివాయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రత్యేక అధికారి విలియమ్స్ తెలిపారు. మండల పరిధిలోని బేతపూడి-2 గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలను చిరునవ్వుతో స్వాగతించి అర్జీలను స్వీకరించాలన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సచివాలయం పరిధిలో పరిష్కారం పొందని సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారాలకు మార్గాలు చూపాలన్నారు. ప్రతి రోజు జరిగే స్పందన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. సచివాలయాలలో నిర్వహించే పనుల వివరాలను రికార్డులలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రికార్డులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించినా, అవకతవకలకు పాల్పడినా సహించేది లేదన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పథకాల వివరాలను తమ పరిధిలోని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది ఉందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

## జీవిత బీమా పై అవగాహన తప్పనిసరి

**ప్రజాశక్తి-చీరాల**

ప్రస్తుతం అనిశ్చిత కాల పరిస్థితుల్లో జీవిత బీమా ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా అవసరమని ఎల్ఐసి చీరాల శాఖ మేనేజర్ ఎ. హరిప్రసాద్ తెలిపారు. స్థానిక వైఎ ప్రభుత్వ మహిళా కళాశాలలో జీవిత బీమాపై అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ జీవిత బీమా వల్ల కుటుంబ యజమాని అకాల మరణ నష్ట భయాల నుంచి కుటుంబం బయట పడవచ్చని చెప్పారు. కరోనా సమయంలో కూడా చాలా మందికి బీమా నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అర్థశాస్త్ర విభాగాధిపతి డి.జాన్రాజ్, రైస్ ప్రిన్సి పల్ ఎన్. విజయలక్ష్మి, చిన్నారావు, వై. శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, సుగుణ కుమారి తదితరులు పాల్గొన్నారు. .

మాట్లాడుతున్న హరిప్రసాద్

## రక్తదానంపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి - బాపట్ల**

విద్యార్థులు రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ రాష్ట్ర శాఖ ప్రాజెక్టు కోఆర్డినేటర్ .కుమార్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాపట్ల ఫార్మసీ కళాశాలలో రక్తదానంపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడేందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. అందుకోసం బ్లడ్ గ్రూపు వారిగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర విశ్రాంత ప్రిన్సిపల్ సెక్రటరీ కెఎస్. సాయిబాబా, బాపట్ల జిల్లాశాఖ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ నారాయణ భట్టు, కళాశాల ప్రిన్సిపల్ మూర్తి, ఎన్‌సిసి కోఆర్డినేటర్ కె. పూర్ణచంద్రరావు, ఎన్ సిసి అధికారి సిహెచ్. సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-రేపల్లె**

టిడిపి కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీ అధికారంలోకి వచ్చేందుకు, చంద్ర బాబు సిఎం అయ్యేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ఓటరు జాబితాలపై బూత్ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో ఇంటిగ్రేటెడ్ శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో అసత్య ప్రచారాలు, అబద్ధపు మాటలు పదే పదే చెప్పి అధికారం చేపట్టారని ఆరోపించారు. ప్రస్తుతం రానున్న ఎన్నికల కోసం కొత్త అబద్దాలు ప్రచారం చేసి, తెలుగుదేశం పార్టీకి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించే యత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ యత్నాలను తిప్పి కొట్టేందుకు బూత్ కమిటీ సభ్యులు, క్లస్టర్ యూనిట్ సభ్యులు, పట్టణ, రూరల్, గ్రామస్థాయి, వార్డు ఇన్‌ఛార్జులు ఓటరు జాబితాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉదయం నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలకు, సాయంత్ర రేపల్లె పట్టణం, రూరల్ గ్రామాలకు చెందిన క్లస్టర్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేర్లు లేక పోయినా, చనిపోయిన వారి పేర్లు ఉన్న కమిటీ దష్టికి తీసుకు వచ్చి సరి చేయంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర మహిళ కార్యదర్శి దున్న జయప్రద, నాగేశ్వరరావు, సూరగాని శాంతికుమార్, రాజశేఖర్, చైతన్య కుమార్, మానం శ్రీనివాస్ నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకుల నివాళి

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

**కారంచేడు :** మండల పరిధిలోని స్వర్ణ-1 గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా పట్టుపరిశ్రమల శాఖ అలధికారి మదన్‌మోహన్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి కానుపులగది, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. అదే విధంగా లేబరేటరీని పరిశీంచి ఇక్కడ రక్త పరీక్షలు పరికరాలు, రికార్డులు, డిస్ప్లే బోర్డులు బాగు న్నాయని స్థానిక ల్యాబ్ టెక్నీషియన్ శంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి యార్లగడ్డ రజిని, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, సర్పంచి మధుసూదనరావు, సచివాలయ సిబ్బంది, డాక్టర్ శాలిని, డాక్టర్ ప్రియ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**బాపట్ల రూరల్ :** వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపిడిఒ రాధాకష్ణ తెలిపారు. మండల పరిధిలోని మూలపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపిడిఒ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బోలిమేర. అనిల్ కుమార్, ఉపాధి హామీ పథకం ఎపిఒ కోటయ్య నాయక్, పంచాయతీ కార్యదర్శి కష్టమూర్తి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.

## సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలి

**పర్చూరు :** క్షేత్ర స్థాయిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ దృష్టికి తీసుకురావాలని టిడిపి బాపట్ల పార్లమెంట్ ఆర్‌టిఎస్ బాధ్యుడు శివ ప్రసాద్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పర్చూరు, కారంచేడు మండలాలకు చెందిన క్లస్టర్, యూనిట్ల బాధ్యులు బూత్ కన్వీనర్లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసు కుంటూ స్థానిక సమస్యలను ఎప్పటి కప్పుడు ప్రత్యేక వాట్సాప్ గ్రూపుల్లో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ఐఇటిడిపి అధ్యక్షుడు మానం శ్రీనివాసరావు, నియోజకవర్గ ఆర్‌టిఎస్ సమన్వయకర్త కొల్లా సుబ్బారాయుడు, మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, టి. శ్రీహరిరావు, మక్కెన శేఖర్‌బాబు, కోడూరి శేషబ్రహ్మాచారి, ఎవి.కృష్ణ, డి.కిరణ్ పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

**వేటపాలెం :** సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల జాతీయ సేవా విభాగం వారి ఆధ్వర్యం మజ్జిగ పంపిణీ చేసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు తెలియజేశారు. కళాశాల జాతీయ సేవా విభాగం వారోత్సవాల సందర్భంగా నాల్గవ రోజు గురువారం చీరాల - ఒంగోలు బైపాస్ హైవేపై ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణు గోపాల రావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు, హైవేపై రాకపోకలు సాగించే ప్రయాణికులు, విద్యార్థులకు ఎడాకాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రంలో జాతీయ సేవా విభాగం ప్రోగ్రామ్ కన్వీనర్ డి. జ్యోతి స్వరూప్, ఎన్ఎన్ ఎస్ కో ఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి-సంక్షేమంపై సమీక్ష

**సంతనూతలపాడు రూరల్ :** సంక్షేమ రాజ్యం జగనన్న తోనే సాధ్యమని ఎమ్మెల్యే సుధాకర్ బాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అభివద్ధి- సంక్షేమంపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం -అభివద్ధి సమాంతరంగా నియోజక వర్గంలో తన హయాంలో జరిగిందన్నారు. ఇప్పటివరకు రూ.232 కోట్ల నిధులుతో నియోజకవర్గంలో ఎన్ఆర్‌జిఎస్, పంచాయతీరాజ్, గహ నిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నాలుగు మండలాల వైసిపి అధ్యక్షులు, ఇంజినీరింగ్ అధికారులు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

## బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి : సిఐటియు

**మద్దిపాడు :** ఢిల్లీలోని జంతర మంతర్ వద్ద మహిళా రేజర్లను వేధించిన బిజెపి ఎంపీ బిజు భూషణ్ కరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. బిజెపి ఎంపిని అరెస్టు చేయాలని కోరుతూ మండల పరిధిలోని వెల్లంపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉబ్బా ఆదిలక్ష్మి మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగి పోతున్నాయన్నారు మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రజా ప్రతినిధులే ఇలాంటి దారుణలకు పాల్పడుతుంటే మహిళలకు రక్షణ ఎక్కడ అని ఆమె ప్రశ్నించారు. ఈ కార్యక్రమం అంగన్‌వాడీలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**సిఐటియు జిల్లా కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్**

మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న రామాంజనేయులు భవనంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కమిటీ సమావేశం అధ్యక్షులు గోపి అధ్యక్షతన గురువారం జరిగింది. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ సెక్రటరీ శ్రీరామ శ్రీనివాసరావు మాట్లాడుతూ కనీసం కార్మికుల పనిముట్లు కార్మికులు కొనుక్కొని పనిచేస్తున్నారని, ముస్కాన్లలో డబ్బాలు లేక ప్లాస్టిక్ సంచులతో చెట్టవేసుకొని కళ్ళు లేని పున్ కాట్ నెట్టుకొని అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చనిపోయిన కార్మికుల బదులు వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని, 60 సంవత్సరాలు దాటి వని ఆపిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. వారి కుటుంబ సభ్యులనే విధులలోకి తీసుకోవాలని. కార్మికులు, అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఎస్ఐ కార్డులు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే కార్మికుందరినీ ఐక్యం చేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మహేష్, కె.శ్రీనివాసులు, నాయకులు బాలకష్ణ, విజయ పాల్గొన్నారు

## ప్రేమ జంటకు వివాహం

వధూవరులను ఆశీర్వదిస్తున్న చంద్రశేఖర్

**ప్రజాశక్తి-పామూరు**

తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని ఇరిగినేని నగర్ కు చెందిన ఇర్ల వెంకటేశ్వర్లు, బండారు లీలావతి ఒకరినొకరు ప్రేమించుకున్నారు. వివాహం కోసం కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సహాయం కోరారు. దారపనేని వరుడి తల్లిదండ్రులు ఇర్ల వెంగయ్య, రమణమ్మ, వధువు తల్లిదండ్రులు బండారు చిన్న తిరుపతయ్య, రత్నమ్మలతో మాట్లాడి.. వారి అంగీకారంతో ప్రేమ జంటకు వివాహం జరిపించారు. ఈ సందర్భంగా ఇర్ల వెంకటేశ్వర్లు, బండారు లీలావతి దంపతులు చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# 'వాగ్దేవి' విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

**ప్రజాశక్తి-మార్కాపురం**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో మార్కాపురం లోని వాగ్దేవి అకాడమి విద్యార్థులు అత్తుత్తమ ప్రతిభను కనబరిచారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో వాగిచెర్ల హింసిక 463/470 మార్కులతో డివిజన్ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. రెండవ స్థానంలో గాధంశెట్టి హరిప్రియ 462/470 మార్కులతో నిలిచారు. మూడవ స్థానంలో మొగుళ్లూరి అక్షయ 461/470 మార్కులతో నిలిచారు. బైపిసి విభాగంలో డి.కోటేశ్వరరావు 420/440 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో యక్కంటి భారతి 982/1000, పి.అమృతవల్లి 973/1000 మార్కులను ఎంపిసి విభాగంలో సాధించారు. బైపిసి విభాగంలో తాళ్ల నాగరాజు 962/1000, దారపునేని బాలచంద్రుడు 961//1000 మార్కులు సాధించారు. విద్యార్థులను మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సత్కరించారు. అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సుబ్బారెడ్డి, డైరెక్టర్లు గొలమారి శివారెడ్డి, ఎ.మోహన్, కె.శ్రీనివాసరావు, పి.రవిశంకర్, జి.కళ్యాణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఇంటర్‌లో 'శ్రీసాధన' విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాశక్తి-మార్కాపురం**

ఇంటర్ ఫలితాల్లో మార్కాపురం పట్టణంలోని శ్రీసాధన జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపల్ టి.క్రిష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి విభాగంలో శెట్టెం వర్షిణి 461/470, లంకా నరసింహనాయుడు 461, పొందుగుల శ్రీలక్ష్మి 459, కాశిరెడ్డి శ్రావణి 458, గంజి గోపి సతీష్‌రెడ్డి 458, బైపిసి విభాగంలో ఎన్ శ్రీలక్ష్మి 425/440, సిఇసి విభాగంలో పొందుగుల శివనారాయణరెడ్డి 458/500, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి విభాగంలో మెరుగు కీర్తి భవనా 983/1000, కూనపులి బాలసాయి శార్వాణి 982, దండూరి కళ్యాణి 980, బైపిసి విభాగంలో జాజ వెంకటసాయి 985/1000, జంతిక లిఖిత 980, ఎంఇసి విభాగంలో ఈపూరి ధనలక్ష్మి 969/1000, కుమ్మరిపల్లి సంతోష్‌కుమార్ 958, సిఇసి విభాగంలో డి.పార్వతి 908/1000, ద్వితీయ సంవంత్సరం బైపిసి విభాగంలో 985 మార్కులతో జిల్లా స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థిని జాజ వెంకటసాయిని కళాశాల యాజమాన్యం ఎంవి క్రిష్ణారెడ్డి, డి.రాజగోపాల్‌రెడ్డి, జివిల్ రమేష్‌బాబు, విఆర్‌కె ప్రసాద్‌లు అభినందించారు. అధ్యాపకుల కృషిని కొనియాడారు.

బిజెపి ఎంపీని

# పోక్సో చట్టం కింద అరెస్టు చేయాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్
- ఒంగోలులో నిరసన కార్యక్రమం

ఒంగోలులో నిరసన తెలుపుతున్న నాయకులు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

మహిళ రెజ్లర్ల క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి పార్లమెంట్ సభ్యులు బ్రిజు భూషణ సింగ్‌పై ఫోక్సో చట్టంలో కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిఐటియు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘ నేతలు డిమాండ్ చేశారు. రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్ సింగ్ పై చర్యలు తీసు కోవాలని కోరుతూ ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద ప్రజా సంఘాల నేతలు నిరసన తెలియజేశారు. కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువు ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ దేశంలో రెజ్లింగ్ క్రీడలో ఒలింపిక్ మెడల్స్ సంపాదించి దేశ ప్రతిష్టను విదేశాల లోనూ సత్తా చాటి దేశానికి ఎంతో పేరు ప్రఖ్యా తులు తెచ్చారన్నారు. రెజ్లర్లు తమపై లైంగిక దాడులకు గురి చేస్తూ అవమానపరుస్తున్న రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బిజెపి ఎంపీ గా కొనసాగుతున్న బ్రిజు భూషణ్ సింగ్‌పై అత్యాచార కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని నాలుగు రోజులుగా ఢిల్లీలో ఆందోళన చేస్తున్నారన్నారు. ప్రధాని మోడీ ,మంత్రులు గాని సమస్యపై పట్టించుకోకపోవడం, కనీసం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును కూడా ఖాతరు చేయడం లేదన్నారు. విచారించి ఎఫ్ఐఆర్ కూడా చేయడానికి పోలీసులు జంకుతున్నారంటే ఈ దేశంలో చట్టం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవాలన్నారు. నిందితుడిపై ఫోక్సో చట్టంలో కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్ బాబు, శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి పి.కల్పన ప్రసంగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి శ్రీను, సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టిమహేష్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డి షమీ్మ, ఐద్వా ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి, గోవిందమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి.ప్రవీణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులు శశాంత్, హేమంత్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు..

**పిసిపల్లి:** ఢిల్లీలో జరుగుతున్న రెజరర్ల ఆందోళనకు సంఘీభావంగా గురువారం పెదచెర్లోపల్లి మండలంలోని బట్టుపల్లి, నడింపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతోటి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో మెట్లు బత్తుల కష్ణారెడ్డి ఎర్రగుంట్ల మోహన్ పాల్గొన్నారు.

**పొదిలి:** మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి యం.పి.బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిఐటియు పొదిలి మండల కార్యదర్శి బి.కోటేశ్వరావు డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి యం.పి.ని అరెస్టు చేయాలని దేశవ్యాప్త నిరసనలో భాగంగా గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పొదిలిలో నిరసన తెలిపారు. నిరసనలో సిఐటియు నాయకులు జి.నాగులు, డి.సుబ్బయ్య, పి.నాగేంద్రం, బి.హాజరత్తమ్మ, కె.వి.నరసింహం, లీలమ్మ పాల్గొన్నారు.

తల్లి లాంటి యర్రగొండపాలెంకు

# రుణపడి ఉంటా..

మార్కాపురంలో..

**ఘనంగా మంత్రి సురేష్ పుట్టినరోజు వేడుకలు**



మంత్రి సురేష్‌కు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ నేతలు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

తనకు రాజకీయ జన్మనిచ్చిన తల్లిలాంటి యర్రగొండపాలెం నియోజకవర్గానికి జీవి తాంతం రుణపడి ఉంటానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆది మూలపు సురేష్ భావోద్వేగంతో హర్షధ్వానాల మధ్య తెలిపారు. గురువారం మంత్రి సురేష్ పుట్టినరోజు వేడుకలు యర్రగొండపాలెంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు, వైసిపి పార్టీ సానుభూతిపరులు వేలాదిగా తరలివచ్చి మంత్రి సురేష్‌కు పుష్పగుచ్చాలు, శాలువలు, మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి సురేష్ చేత భారీ కేక్ కట్ చేయించి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సంధర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగం చేసుకుంటున్న తాను 2008లో వైఎస్ఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. 2009, 2019లో రెండుసార్లు యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించి, అభిమానించి భారీ మెజార్టీతో గెలిపించారని చెప్పారు. జగనన్న వెనుక నడుస్తూ ఆయన మంత్రివర్గంలో పని చేసే భాగ్యం లభించడంతో తన జన్మ ధన్యమైందన్నారు. కార్యక్రమంలో జార్జి విద్యా సంస్థల అధినేత, వైసిపి యువనేత ఆదిమూలపు విశాల్, ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, జడ్పి కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధి కమిటి చైర్మన్ నర్రెడ్డి వెంకటరెడ్డి, సిఐ మారుతీకృష్ణ, ఎస్సై జి కోటయ్యతో పాటు ఐదు మండలాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**మార్కాపురం:** మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జన్మదిన వేడుకలు మార్కాపురంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. జార్జి గెస్ట్‌హౌస్‌లో ఈ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబులు జన్మదిన వేడుకల్లో పాల్గొని మంత్రి సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మార్కాపురం, పొదిలి మున్సిపల్ కమిషనర్లు బిఎస్ గిరికుమార్, కె.డానియేలు జోసఫ్‌లు తమ సిబ్బందితో మంత్రి డాక్టర్ సురేష్‌ను సత్కరించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేక్‌ను కట్ చేశారు. జార్జి విద్యా సంస్థల తరపున సిబ్బంది గజమాలతో డాక్టర్ సురేష్‌ను సత్కరించారు. వేడుకల్లో మంత్రి తనయుడు, జార్జి విద్యా సంస్థల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్, జార్జి విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌లు పాల్గొన్నారు.

**పెద్దదోర్నాల:** పెద్దదోర్నాలలోని మేజర్ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ చిత్తూరి హారిక ఆధ్వర్యంలో మంత్రి సురేష్ పుట్టినరోజు సంధర్భంగా గురువారం కేక్ కట్ చేశారు. కార్యకర్తలకు పంచి పెట్టారు. మంత్రి సురేషకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపిపి దర్శనం నాగయ్య, సర్పంచ్ ఎక్కంటి వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ రసూల్, నాయకులు వెన్నా కాశిరెడ్డి, జోగి వెంకట నారాయణ, లాలా నాయక్, సుబ్బారావు, ప్రసాద్, తన్నిది కిశోర్ కుమార్, వెంకటేశ్వర్లు, కెవిపిఎం అధినేత దర్శనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.